పొలాల్లోకి పారిశ్రామిక వ్యర్థాలు

- కాలూర్, ఖానాపూర్ పంట భూముల్లోకి బాయిల్డ్ రైస్‌మిల్లుల కలుషిత నీరు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు



కాలూర్ శివారులోని పంటపొలాల్లోకి వెళ్తున్న పరిశ్రమల మురుగునీరు

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని గ్రామాల్లో గల పంటభూముల్లోకి పారిశ్రామిక వ్యర్థాలు చేరుతున్నాయి. కలుషిత నీటితో తమ పంటలు దెబ్బ తినే ప్రమాదం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా సమస్యను ఎవరూ పట్టించుకోవడంలేదని పేర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి..

నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలోగల కాలూర్, ఖానాపూర్ గ్రామాల్లో సుమారుగా వంద రైస్ మిల్లులు ఉంటాయి. వాటిల్లో బాయిల్డ్ రైస్‌మిల్లుల నుంచి వెలువడే వ్యర్థాలు నీటి కాలువల ద్వారా కాలూర్, ఖానాపూర్ గ్రామాల్లో ఉన్న పంటపొలాలకు చేరుతున్నాయి. కలుషిత నీరు పొలాల్లో చేరడంతో భూమి మొత్తం నిస్సారం అయిపోతుందని రైతులు పేర్కొంటున్నారు. రైస్‌మిల్ యజమానులు ఇష్టారీతిన వ్యర్థాలు విడుదల చేయడంతో స్థానిక గ్రామాల్లో పరిసరాలు కలుషితం కావడంతోపాటు దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు, ఎమ్మెల్యేకు విన్నవించినా..

వ్యవసాయ భూములకు రైస్‌మిల్ వ్యర్థాలు రావడంతో రానున్న రోజుల్లో తమ పొలాల్లో పంటలు పండుతాయో లేదో అని రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. రైస్ మిల్ వ్యర్థాలు తమ భూముల్లోకి రావద్దని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై గతంలో రాస్తారోకోలు చేసినా, కలెక్టర్, సంబంధిత అధికారులకు విన్నవించినా ప్రయోజనం కలగలేదని వాపోతున్నారు. రెండు నెలల క్రితం రైతులు తమకు న్యాయం చేయాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వద్దకు వెళ్లారు. దీంతో ఆయన రైస్‌మిల్‌ల యజమానులను కొందరిని పిలిపించుకుని మాట్లాడారన్నారు. త్వరలో ప్రత్యేక డ్రెయినేజీ ఏర్పాటు చేసి, కలుషిత నీరు పొలాల్లో రాకుండా చర్యలు చేపడుతామని వారు ఎమ్మెల్యేకు తెలిపారని రైతులు వివరించారు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే స్పందించాలి..



నగర శివారులోని కాలూర్, ఖానాపూర్ పరిధిలో అనేక పరిశ్రమలు ఉన్నాయి. వాటి వ్యర్థాలు మా గ్రామాల్లోకి రావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరాల తరబడి సమస్య అలానే ఉండిపోతుంది. అయినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పట్టించుకుని సమస్యను పరిష్కరించాలి.

–కోర్వ రాజేంద్ర ప్రసాద్, ఖానాపూర్

క్లుప్తంగా

పెద్ద చెరువు లీకేజీల గుర్తింపు



ఇందల్వాయి: రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచన మేరకు ఇందల్వాయి గ్రామ పెద్ద చెరువును ఇరిగేషన్ అధికారులు బుధవారం పరిశీలించారు. చెరువు అలుగు, తూములను పరిశీలించి లీకేజీలను గుర్తించారు. మరమ్మతులకు అవసరమైన నివేదికను ఉన్నతాధికాలకు అందిస్తామని, నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతామని వారు తెలిపారు. అధికారులు బాను ప్రకాష్, ప్రేమ్‌కుమార్, మాదురి, నాయకులు నవీన్ గౌడ్, గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

యువ గర్జనను విజయవంతం చేయండి



నిజామాబాద్‌అర్బన్: ఫిబ్రవరి 2న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే విద్యార్థి యువ గర్జనను విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బరికుంట శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు సభకు సంబంధించిన పోస్టర్లను బుధవారం నుడా చైర్మన్ కేశవేణు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలన్నారు. సభకు వేలాదిగా యువత తరలిరావాలన్నారు. నాయకులు రాజు గగన్, దేవయ్య గైక్వాడ్, గంగాధర్, సాయికాంబ్లే, శంకర్, హరీష్, సురేష్, లత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, టీచర్స్ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. నిజామాబాద్‌లో బుధవారం ఆయన పర్యటించారు. తపస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో అన్ని ప్రభుత్వాలు విద్యను నిర్లక్ష్యం చేశాయని, గతంలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారు కూడా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. అనంతరం ఆయన ట్రస్మా యూనియన్ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మోపాల్‌లో పశువైద్య శిబిరం



మోపాల్: మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పశువుల గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఏడీలు గంగాధర్, మజ్జు, గోపి కృష్ణ, శిరీష, బాబూరావులు పశువులకు చికిత్సలు చేశారు. అనంతరం అవసరమైన వారికి మందులను అందజేశారు. పాడి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన మోదీ



ఆర్మూర్: పీఎం మోదీ మూడు నల్ల చట్టాలతోపాటు నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని తీసుకువచ్చి రైతులను మోసం చేశారని అఖిల భారత ఐక్య రైతు సంఘం ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాష్ట్రాల్లో నూతన మార్కెట్ వ్యవసాయ విధానాన్ని అసెంబ్లీలలో తిరస్కరించే విధంగా ఒత్తిడి తేవాలన్నారు. రైతులు, కార్మికుల భాగస్వామ్యంతో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఆరు గ్యారంటీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. నాయకులు దేవారం, సారా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆర్మూర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. ఈమేరకు పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం ఎదుట బుధవారం పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనిల్, నిఖిల్, వినోద్ పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలి



తెయూలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తయారు చేసిన యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాజేశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్రాల పరిధిలో ఉన్న యూనివర్సిటీలలో కేంద్రం పెత్తనం చెలాయించేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. నాయకులు ప్రిన్స్, దేవిక, అక్షయ్, బిందు, తిరుపతి, మధు, రాజేందర్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..

విద్యను కాషాయీకరణ చేసే కుట్రలో భాగంగా తయారు చేసిన యూజీసీ నూతన ముసాయిదాను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను బుధవారం తెయూ వీసీ యాదగిరిరావు ఆవిష్కరించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్, తెయూ అధ్యక్షుడు శివ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. నాయకులు చరణ్, పృథ్వీ, సంతోష్, కిరణ్, పవన్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

స్పోర్ట్స్ డైరెక్టర్‌పై ఆరోపణలు అవాస్తవం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్‌పై ఇటీవల ఓ విద్యార్థి సంఘం నాయకులు చేసిన అవినీతి ఆరోపణలు అవాస్తవమని వర్సిటీ క్రీడాకారులు కొందరు తెలిపారు. ఈ మేరకు బుధవారం తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరి రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అసత్య ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వీసీని కోరారు.

సభాపతికి ఆహ్వాన పత్రిక అందజేత



నిజామాబాద్ రూరల్: రాష్ట్ర సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బుధవారం వారాహి అమ్మవారి ప్రతిష్ఠాపన ఆహ్వాన పత్రికను వారాహి మాత ఆలయ కమిటీ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ గుప్తా అందజేశారు. నిజామాబాద్‌లో ఫిబ్రవరి 10న ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలంటూ ఆయనను ఆహ్వానించినట్లు జ్ఞానేందర్ తెలిపారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్‌నాగారం: ముషిరాబాద్ గోల్‌కొండ క్రాస్‌రోడ్‌లో హెబ్రానుచర్చిపై దాడి చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ వి జెకర్యా ఆనంద్ కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. చర్చిపై దాడిని ఖండిస్తున్నామన్నారు. సంఘ సభ్యులు డానియేలు, జోసేఫ్, ఆమోస్, జాన్‌బానియన్ పాల్గొన్నారు.

లీప్ సంవత్సరంపై అవగాహన

నిజామాబాద్‌అర్బన్: కంఠేశ్వర్‌లోని మహిళా కళాశాలలో బుధవారం రిటైర్డ్ ఉద్యోగి విజయానందరావు లీప్ సంవత్సరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లీపు సంవత్సరంపై ఆంగ్లం, తెలుగులో వ్యాసం రాసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ దేవిక బుధవారం నోట్‌బుక్స్ పంపిణీచేశారు. ఉపాధ్యాయులు ప్రేమ్‌లాల్, భారతి, జ్యోత్స్న, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ



సుభాష్‌నగర్: మండలంలోని కంజర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి నవదీప్ సాయి సౌత్ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చూపి కర్నాటక సైన్స్ అండ్ టెక్నాలజీ ఉత్తమ పురస్కారానికి ఎంపికై నట్లు హెచ్‌ఎం గోపాలచారి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థి నవదీప్ సాయి, గైడ్ టీచర్ గోపాలకృష్ణను పుదుచ్చేరి విద్యాశాఖ సంచాలకులు ప్రియదర్శిని ఇటీవల అభినందించి బహుమతి ప్రదానం చేశారన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



తొండాకూర్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్ రావు

డొంకేశ్వర్(ఆర్మూర్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావు అన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు డొంకేశ్వర్ మండలంలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన సందర్భంగా ఎంపీడీవో బుధవారం పలు పాఠశాలలను సందర్శించారు. డొంకేశ్వర్, తొండాకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను కూడా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఎంపీవో లక్ష్మీప్రసాద్ ఉన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం వంట సరుకులను పరిశీలించారు.

అంకాపూర్‌లో నల్గొండ రైతుల పర్యటన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని నల్గొండ జిల్లా నర్సింగ్‌పూర్ గ్రామ రైతులు బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా రైతులు గ్రామంలోని పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన విత్తనశుద్ధి కర్మాగారాలు, నీటి నిలువ తొట్టిలను పరిశీలించారు. అంకాపూర్ రైతులు చేపడుతున్న అంతర పంటల సాగు, వాణిజ్య పంటల గురించి గురడిరెడ్డి కాపుసంఘం మాజీ కార్యదర్శి కేకే భాజన్నను అడిగి తెలుసుకున్నారు. ఏఈవో సవిత, జీపీ కార్యదర్శి హారిక పాల్గొన్నారు.

అగ్రికల్చర్ విద్యార్థుల క్షేత్రపర్యటన

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పసుపు పరిశోధన స్థానాన్ని సిరిసిల్లాలోని బాబూ జగ్జీవన్ రాం వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం సందర్శించారు. రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా బీఎస్సీ అగ్రికల్చర్ నాలుగో సంవత్సరం విద్యార్థులు పరిశోధన స్థానాన్ని సందర్శించారు. వారికి శాస్త్రవేత్తలు మహేందర్, శ్రీనివాస్‌గౌడ్ పసుపు పంటకు సంబంధించి సాగు విధానం, తెగుళ్లు, చీడ పీడలు, పంట ప్రాధాన్యత వివరించారు. పసుపు పంటపై చేస్తున్న పరిశోధనలను తెలియజేశారు. పసుపు రకాల గురించి, కుర్కుమిన్ గురించి అవగాహన కల్పించారు.

క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడాలి



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్‌నాగారం: ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో వెల్నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ లీగ్‌కు బుధవారం ఆయన హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని సరదాగా బ్యాటింగ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు ఆడడం వల్ల మానసికంగా శారీరకంగా ధృడంగా ఉంటారన్నారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి, నరేష్, విపుల్‌గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ధర్నాలు చేస్తున్నారని ఎల్లవేళల వారికి అండగా ఉంటామని భవన నిర్మాణ కార్మికుల సంఘం సౌత్ ఇండియా చైర్మన్ హనుమగౌడ్, స్టేట్ డైరెక్టర్ మాలెపు నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో భవన నిర్మాణ, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు బుధవారం ధర్నా శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు ఎల్లవేళలా తమ సహాయసహకారాలు ఉంటాయన్నారు. సంఘ ప్రతినిధులు రామగౌడ్, రాజేందర్, అన్వేష్ లక్ష్మీనారాయణ, కల్లెడి గంగాధర్, మహ్మద్ రహీం, కూన గంగాధర్, బాబురావు షిండే, పెంచాల శ్రీనివాస్,ఎడ్ల ప్రభాకర్, సురేష్ చారి కార్మికులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీవారి కల్యాణం



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో గల శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మక్కెన శ్రీరామమూర్తి దంపతులు అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు,అర్చకులు పాల్గొన్నారు.

1నుంచి హరిహర క్షేత్ర బ్రహ్మోత్సవాలు



డిచ్‌పల్లి: మండలంలోని బర్దిపూర్ గ్రామంలోగల హరిహర క్షేత్రం ద్వాదశ బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామపెద్దలు, ఆలయ పూజారులు రాహుల్ శర్మ, రాజశేఖర శర్మ కోరారు.

ఘనంగా అన్నపూర్ణేశ్వరి జాతర



సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ సమీపాన గల త్రీహిల్స్ అన్నపూర్ణేశ్వరి దేవి ఆలయ జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో పురోహితులు ప్రత్యేక పూజలు జరిపారు. పల్లకీసేవ, రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసత్రం ఏర్పాటు చేశారు.

లొంక శైవక్షేత్రంలో భక్తుల సందడి



సిరికొండ: మండలంలోని శైవక్షేత్రం లొంకలో బుధవారం మాఘ(మౌని) అమావాస్య సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఈసందర్భంగా భక్తులు స్థానిక పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలోని సైకత లింగంను దర్శించుకొని పూజలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసత్రం ఏర్పాటు చేశారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	82,500	వెండి(కిలో)	94,800
22 క్యారెట్స్	76,275	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సుడ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	40	60
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	35	60
బీరకాయ	50	90	దోసకాయ	30	50
దొండకాయ	35	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	15	30	కరివేపాకు	60	100
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	80
క్యాప్సికం	40	60			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఐడెంటిటీ(తెలుగు)-1.30 డాకు మహారాజు -4.30 10.20 గేమ్ ఛేంజర్(తెలుగు)-7.20
స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.30, 4.30, 7.20, 10.00
స్క్రీన్-3	స్కై ఫోర్స్(హిందీ)- 11.00, 1.50, 4.50, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-2	స్కై ఫోర్స్(హిందీ)-10.50, 1.35, 7.25, 10.10 డాకు మహారాజు (తెలుగు)- 4.20
స్క్రీన్-3	తొలిమనసు(తెలుగు)-11.05 గాంధీ తాత చెట్టు(తెలుగు)-2.10 8.00 గేమ్ ఛేంజర్(తెలుగు)- 4.40 హత్య(తెలుగు)-10.30
స్క్రీన్-4	డియర్ కృష్ణ(తెలుగు)-11.00 ఐ డెంటిటీ(తెలుగు)-1.45 హాంగ్‌కాంగ్ వారియర్స్(తెలుగు)-5.00 డాకు మహారాజు(తెలుగు)-7.20 పుష్ప-02(తెలుగు)-10.25
లలితామహల్	గేమ్ ఛేంజర్(తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	స్కై ఫోర్స్(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ అన్నారు. ఈమేరకు ఆయన ఆర్మూర్‌కు చెందిన నాయకులతో కలిసి బుధవారం హైదరబాద్‌లోని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. గిరగాని బిక్షపతి గౌడ్, ఎర్ర శ్రీహరి గౌడ్, సత్యం, సలీం, సల్మాన్, అభిషేక్ పటేల్, మహేష్, రాకేష్ యాదవ్, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఖర్గే వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సనాతనం ధర్మం, మహా కుంభమేళా విషయంలో అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని పార్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన నిర్వహించారు. మహా కుంభమేళా విజయవంతం కావడం కాంగ్రెస్ నేతలకు నచ్చడం లేదన్నారు. నాయకులు జెస్సు అనిల్, పులి యుగేందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



పెర్కిట్(ఆర్మూర్): ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని, వాటిని అలవాటుగా మార్చుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఆర్మూర్ ఎంవీఐ వివేకనందరెడ్డి అన్నారు. చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐ ముఖ్య అతిథిగా హాజరై, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రకాష్, క్లబ్ ప్రతినిధులు రజనీష్ కిరాడ్, ఆనంద్, ఖాందేష్ సత్యం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.